గోదావరి జలాలతో చెరువులు నింపుతాం

- ఒక్క ఎకరానూ ఎండిపోనివ్వం
- చివరి మడి వరకూ సాగు నీరందిస్తాం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- అశ్వరావుపల్లి రిజర్వాయర్ కాల్వ పనుల పరిశీలన

అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అశ్వరావుపల్లి కాల్వ పనులను పరిశీలిస్తున్న కడియం శ్రీహరి

లింగాలఘనపురం, మార్చి 4 : నియోజకవర్గం లోని ప్రతి చెరువునూ గోదావరి జలాలతో నింపి సాగు నీరందిస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. చివరి మడి వరకూ నీరందించి ఒక్క ఎకరా ఎండిపోకుండా చూస్తామని స్పష్టం చేశారు. దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన అశ్వరావుపల్లి రిజర్వాయర్ ప్రధాన కాల్వతోపాటు నెల్లుట్ల–నాగారం వరకున్న ఎల్–16 కాల్వ పనులను శ్రీహరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశ్వరావుపల్లి కాల్వ ద్వారా లింగాలఘనపురం మండలం నాగారం, లింగాలఘనపురం, కళ్లెం, సిరిపురం, మాణిక్యపురం, ఏనెబావి, జీడికల్ చెరువుల్లోకి గోదావరి జలాలు చేరుతాయన్నారు. అధికారులు ట్రయల్‌రన్ చేపట్టినందున నియోజకవర్గంలోని చెరువులను నింపుతామన్నారు. ఒక్క ఎకరాను ఎండిపోనివ్వనిమని, చివరి మడి వరకూ సాగునీందిస్తామన్నారు. రైతు హరిప్రసాద్‌తో ఎమ్మెల్యే శ్రీహరి ఫోన్‌లో మాట్లాడారు. 6 గుంటల భూమికి నష్టపరిహారం అందించేలా కలెక్టర్‌తో మాట్లాడుతానని, కాల్వ పనులను అడ్డుకోవద్దని రైతుకు సూచించారు. పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని అధికారులతో స్పష్టం చేశారు. ప్యాచ్ వర్క్‌ను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్ వెంకట్‌రెడ్డికి సూచించగా, బిల్లులు రావడంలేదని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి బిల్లులు తప్పక వస్తాయని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డీఈ రవి, ఈఈ ప్రవీణ్, ఏఈ పూర్ణచందర్, కాంట్రాక్టర్ వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి, ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దూసరి గణపతి, దుంబాల భాస్కర్ రెడ్డి, చిట్ల భూపాల్‌రెడ్డి, కత్తుల శ్రీపాల్‌రెడ్డి, బింగి స్వామి, మల్ల శ్రీశైలం, కర్రె కృష్ణ, గట్టగల్ల శ్రీహరి, మోటె వీరస్వామి, చౌదరపెల్లి విజయభాస్కర్, బుషిగంపల ఆంజనేయులు, చౌదరపెల్లి శేఖర్, బుషిగంపల ఉపేందర్ పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ ఇవ్వాలి

- రైతుల సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ చౌరస్తా, మార్చి 4 : వ్యవసాయానికి కోతల్లేకుండా నిరంతర విద్యుత్ అందించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషాను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలపై సుమారు గంట పాటు కలెక్టర్, అదనపు కలెక్టర్లతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి పనులతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులకు వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని రఘునాథపల్లి, లింగాల ఘనపురం మండలాల పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరందించాలని ప్రభుత్వాన్ని కోరారు. దేవాదుల రిజర్వాయర్ల కాల్వలు పూర్తయినా, అక్కడక్కడ భూ సేకరణ సమస్యలతో కాంట్రాక్టర్ పనులు నిలిపేశారన్నారు. రైతులకు సాగు నీరందక ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి రావడంతో అశ్వరావుపల్లి కు డి కాల్వ వెంట సంబంధిత రైతులతో కలిసి పరిశీలించినట్లు కడియం తెలిపారు. అధికారులు లేదా కాంట్రాక్టర్ అలసత్వంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌తో పాటు నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడానని వివరించారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇవ్వడంతో పాటు అవసరమైన సాగునీరు అందించాలని కడియం శ్రీహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరంతర విద్యుత్ ఏ అధికారి ఇవ్వలేకపోతాడో, ఆ అధికారిని సస్పెం డ్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పత్రికా ప్రకటన చేశారని గుర్తుజేశారు. కానీ ఆచరణలో దీనికి భిన్నంగా ఉందన్నారు. విద్యుత్ కనీసం నిరంతరాయంగా నాలుగు, ఐదు గంటలు కూడా రావడం లేదన్నారు. రెండు గంటలకు ఒకసారి కరెంట్ పోతుండడంతో బోర్లు, మోటర్లు దెబ్బతిని రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఓ వైపు భూగర్భ జలాలు అడుగంటగా, మరోవైపు రిజర్వాయర్‌లో నీళ్లున్నా రైతులకు ఇవ్వలేని దుస్థితిలో పాలకులు ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం తో రైతులు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. దీనిపై కలెక్టర్ దృష్టికి తేగా రెండు, మూడు రోజు ల్లో దేవాదుల కాల్వల్లో చెట్లను తొలగించి సాగు నీరందిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

నెల్లుట్ల చెరువులోకి డ్రైనేజీ నీరు రాకుండా చూడాలి

జనగామ పట్టణం నుంచి వచ్చే డ్రైనేజీ నీటిని నెల్లుట్ల చెరువులోకి రాకుండా, వాగులోకి మళ్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. సూర్యాపేట మార్గంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ప్రమాదాలు జరుగుతున్నందున దీని నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల హామీలు అమలు కావడం లేదన్నారు. రైతు భరోసా పేరిట రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పినా నేటికీ అతీగతిలేదని విమర్శించారు. ఫిబ్రవరి చివరిలో గా రైతుబంధు ఇస్తామన్నారు, వేలాది మంది రైతుల ఖాతాలో ఇంకా డబ్బులు జమ కాలేదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి విద్యుత్, వ్యవసాయరంగాలపై సమీక్ష నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని శ్రీహరి డిమాండ్ చేశారు.

ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

అర్జీదారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా

జనగామ చౌరస్తా, మార్చి 4 : ప్రజల సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజావాణి'లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్మార్ పింకేశ్ కుమార్ లలిత్‌కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్‌తో కలిసి తొలిసారిగా కలెక్టర్ ప్రజల నుంచి 112 దరఖాస్తులను స్వీకరించారు. రఘునాథపల్లి మండలం బాంజిపేటకు చెందిన బిట్ల నరేశ్ సాదా బైనామాలో తమ భూసమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. నర్మెట మండలం కన్నెబోయినగూడేనికి చెందిన జయరాజు తన సోదరుడు భూమిని అక్రమంగా రాయించుకున్నాడని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. దేవరుప్పుల మండలం ధర్మపురానికి చెందిన భువనగిరి సోమలక్ష్మి, ఆమె కుమారుడు పుట్టుకతో చెవుడు, మూగ సమస్యతో బాధపడుతున్నందున వారికి సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని అర్జీ సమర్పించారు. బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన జూల వీరయ్య తనకు సంబంధించి సర్వేనంబర్ 775లో 4.16 ఎకరాల భూమి ఉంటే కేవలం 16 గుంటలు మాత్రమే తన పేరిట పట్టా అయిందని, మిగతా భూమిని కూడా తన పేరిట నమోదు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ భాషాకు అర్జీ అందజేశారు. హనుమకొండకు చెందిన రిటైర్డ్ ఎస్సై మక్బుల్ అలీ తన బంధువులకు సంబంధించి పెంబర్తి శివారులో ఆపద్బంధు స్కీమ్‌లో గురుదేవా ఇన్‌ఫ్రా డెవలపర్స్‌లో ఖాళీ ప్లాటును కొనుగోలు చేశారని తెలిపారు. ప్లాటుతో పాటు దాని పక్కనే ఉన్న మరో 40 ప్లాట్లను పెంబర్తికి చెందిన కొందరు ఆక్రమించి, దానిని వ్యవసాయ భూమిగా మార్చుకొని ధరణిలో తమ పేరు నమోదు చేసుకొని రైతుబంధు పొందుతున్నట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ భాషాకు అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు సమర్పించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి విచారణ జరుపాలని అధికారులను కోరారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డీఆర్డీవో మొగులప్ప, డీఈవో కే రాము, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఇస్మాయిల్, సివిల్ సప్లై అధికారి రోజారాణి, డీఏవో వినోద్ కుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ కేఆర్ లత, మత్స్యశాఖ అధికారి నాగులు, బీసీ సంక్షేమశాఖ అధికారి బీ రవీందర్, లేబర్ అధికారి కుమారస్వామి, డాక్టర్ సుగుణాకర్‌రాజు పాల్గొన్నారు.

దాతలందించిన పరీక్ష ప్యాడ్స్, పెన్నులతో విద్యార్థులు

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

రఘునాథపల్లి, మార్చి 4: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు 10 జీపీఏ సాధించాలని ఆరూరి గంగ అన్నారు. మండలంలోని మండెలగూడెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయులు భారత రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామానికి చెందిన ఆరూరి గంగ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించారు. గ్రామవికాస మండలి అధ్యక్షుడు గాదె ప్రకాశ్ 9వ తరగతి విద్యార్థులకు విజ్ఞానానికి సంబంధించిన సామగ్రి బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. కార్యక్రమంలో మాజీ విద్యా కమిటీ చైర్మన్ కనకయ్య, ఉపాధ్యాయులు రామ్మోహన్, విజయలక్ష్మి, అనిల్‌కుమార్, యాదగిరి, శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

మూడు పోస్టులకు ఎంపికైన భాస్కర్

రఘునాథపల్లి, మార్చి 4: మండలంలోని భాంజీపేటకు చెందిన కన్న లక్ష్మి–సోమనర్సయ్య దంపతుల కుమారుడు కన్న భాస్కర్ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అబ్బురపర్చాడు. జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికై సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపు పత్రాన్ని అందుకున్నారు. ప్రాథమిక స్థాయి నుంచి కళాశాల వరకు ప్రభుత్వరంగంలోనే విద్యాభ్యాసం చేశారు. 2017లో గురుకుల టీజీటీ ఉద్యోగం, 2019లో (టీఆర్టీ) తెలుగు లాంగ్వేజ్ పండిట్ ఉద్యోగం సాధించగా తాజాగా జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికై శభాష్ అనిపించుకున్నాడు. భాస్కర్ మాట్లా డుతూ పేదరికం చదువుకు, ఉద్యోగం సాధించడానికి అడ్డుకాదన్నాడు. కష్టపడి చదివితే ఫలితం వస్తుందన్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌ను స్నేహితులు, గ్రామస్తులు అభినందించారు.

జడ్జి రవీంద్రశర్మను కలిసిన కలెక్టర్

జడ్జికి పూల మొక్కను ఇస్తున్న కలెక్టర్

జనగామ చౌరస్తా, మార్చి 4 : జిల్లా కోర్టు ప్రధా న న్యాయమూర్తి డీ రవీంద్రశర్మను సోమవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను జడ్జికి అందజేశారు. ఇరువురు పలు అంశాలపై చర్చించారు.

సీపీని కలిసిన ఎస్సై

రఘునాథపల్లి, మార్చి 4: రఘునాథపల్లి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన దూదిమెట్ల నరేశ్ సోమవారం వరంగల్‌లో పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝాను మర్యాద పూర్వకంగా కలిశారు. సీపీకి పూల మొక్కను అందించారు. సీపీ మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేయాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

దేవరుప్పులలో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

దేవరుప్పుల, మార్చి 4 : అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కల్యాలక్ష్మి పథకంలో లబ్ధిదారులకు సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను దశలవారీగా అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే నాలుగు గ్యారెంటీలు అమలవుతుండగా, త్వరలో మరో రెండు అమలుకు సీఎం ప్రణాళికలు తయారు రూపొందిస్తున్నారని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి, తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, నాయబ్ తహసీల్దార్ నవీన్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే సర్కారు ధ్యేయం

కొడకండ్ల : గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రూ. 2 కోట్లతో చేపట్టి సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొడకండ్ల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. పేదల కోసం సంక్షస్త్రమ పథకాలు అమలు చేస్తున్నామని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- 5వ రోజు 95.64 శాతం విద్యార్థులు హాజరు
- ఫస్టియర్ జనరల్ 85 మంది, ఒకేషనల్‌లో 131 మంది గైర్హాజర్

జనగామ చౌరస్తా, మార్చి 4 : ఇంటర్ థియరీ వార్షిక పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు సోమవారం జిల్లాలోని 18 పరీక్ష కేంద్రాల్లో ఫస్టియర్ విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్–1 ఏ, బాటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ విభాగం విద్యార్థులు 3,570 మంది హాజరుకావాల్సి ఉండగా 3,485 మంది మాత్రమే పరీక్ష రాశారు. మరో 85 మంది గైర్హాజర్ అయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,381 మంది హాజరుకావాల్సి ఉండగా 1,250 మంది పరీక్ష రాశారు. మిగతా 131 మంది గైర్హాజర్ అయ్యారు. జనరల్, ఒకేషనల్ విభాగం కలిపి ఫస్టియర్‌లో 95. 64 హాజరు శాతం నమోదైంది. స్టేషన్ ఘన్‌పూర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, మోడల్ జూనియర్ కళాశాలను డీఐఈవో బైరి శ్రీనివాస్ పరిశీలించారు. దేవరుప్పుల, కొడకండ్ల మండల కేంద్రాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఈసీ మెంబర్లు, పాలకుర్తి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, జఫర్‌గఢ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు తనిఖీ చేశారు.

'పల్స్‌పోలియో' విజయవంతం

చిన్నారికి పోలియో చుక్కలు వేయిస్తున్న జనార్దన్

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 4 : జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని స్థానిక ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జనార్దన్ తెలిపారు. ఇప్పటి వరకు 95 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు. సోమవారం నిర్వహించిన ఇంటింటి సర్వేలో ఆయన మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలో 58 మందికి, ఇప్పగూడెం పీహెచ్‌సీ పరిధిలో 120 మందికి, తాటికొండ పీహెచ్‌సీ పరిధిలో 80 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు. సంచార జీవనం సాగించే కుటుంబాల్లో 26 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు జనార్దన్, ప్రణతి, జ్యోతి, సీహెచ్‌వోలు సాంబయ్య, కిషన్‌రావు, పర్వీన్ సుల్తానా, సూపర్‌వైజర్లు కృష్ణ, రమణ, గాలిబ్ పాల్గొన్నారు.

ఐలమ్మ విగ్రహ ఏర్పాటు హర్షణీయం

పాలకుర్తి, మార్చి 4: తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించడం హర్షణీయమని రజక వృత్తిదారుల సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పెత్తందార్లకు వ్యతిరేకంగా, పేదల హక్కుల కోసం ఐలమ్మ పోరాడిందని గుర్తుజేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఐలమ్మకు గుర్తింపు ఇవ్వడం ఆనందకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలమ్మ వారసుడు, మాజీ సర్పంచ్ చిట్యాల రామచంద్రం, నాయకులు లొంక ఐలయ్య, గుమ్మడిరాజు పాపయ్య, చిట్యాల సంపత్, ఎల్లయ్య, జ్యోతి కొమురయ్య, చీలూరి సోమరాజు, అంజయ్య, సాంబరాజు, గుమ్మడిరాజుల కొమురయ్య, మచ్చ సోమయ్య, రవి పాల్గొన్నారు.

రజక సంఘం నాయకుల హర్షం..

స్టేషన్ ఘన్‌పూర్ : హైదరాబాద్‌లోని ట్యాంకు బండ్‌పై వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని రజక సంఘం మండల కన్వీనర్ అక్కనపల్లి అంజయ్య తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యమ నేత, కేసీఆర్ పాలనలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించిందని గుర్తు చేశారు. అమరుల త్యాగాలను యువతకు స్ఫూర్తిగా సర్కారు నిలుపాలని ఆయన కోరారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

జనగామ చౌరస్తా, మార్చి 4 : అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ప్రజాదర్బార్ వెబ్‌సైట్‌లో జిల్లా నుంచి 450 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వేసవిలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి : సీఐ

దేవరుప్పుల, మార్చి 4: మండలంలో చోరీల నివారణకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ ఠాణాకు వచ్చే ప్రజలతో నడుచుకోవాల్సిన తీరును పోలీసులకు వివరించారు. గ్రామాల్లో నేరాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, సమాచార సేకరణలో ముందుండాలన్నారు. గంజాయి, గుడుంబా నియంత్రణకు కృషి చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట ఎస్సై చెన్నకేశవులు ఉన్నారు.

మత్స్య సొసైటీ అధ్యక్షుడిగా యాదగిరి

దేవరుప్పుల, మార్చి 4: మండలంలోని కామారెడ్డిగూడెం మత్స్య పారిశ్రామిక సొసైటీ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా దండు యాదగిరి, ఉపాధ్యక్షుడిగా పంగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దండు ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా దండు రాజు, పంగ యాదగిరి, దండు మొగులయ్య, పంగ నర్సయ్య, మడికంటి బాలరాజు, దండు మహేశ్, స్వామి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మత్స్యకారుల హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Tirumalagiri Branch వారు ఇచ్చిన బొగొట్టు ప్రకారం యావన్మందికి తెలుపునది ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తి రిజిస్ట్రార్ తనఖా చేయించుకొని, శ్రీ/శ్రీమతి ధారవత్ సునీత, భర్త: సారిమ గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకొన్నాము. కావున సదరు వ్యవహారముకు సంబంధించి, సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు, చార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్సు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నాటి నుండి (7) ఏడు దినములలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కాదు.

SCHEDULE OF THE PROPERTY

రెవెన్యూ గ్రామం: మొండ్రాయి, గ్రామపంచాయితీ: గిర్నితండ, సర్వే నెం. 355, ఇంటి నెం. 4–51కు చెందిన విస్తీర్ణం: 360 చ.గ.లు, సరియగు 300.7 చ.మీ.లు ఖాళీ స్థలంలో నిర్మితమైన ఆర్.సి.సి. ఇల్లు కట్టుబడి 400 చ.అ.లు. హద్దులు: తూర్పు: తంగెళ్ళపురి రామ్మూర్తి గారి ఇల్లు, పడమర: ధరావత్ బిక్షం గారి ఇల్లు, ఉత్తరం: ధరవత్ లోకేష్ గారి ఇల్లు, దక్షిణం: గ్రామ పంచాయితి సి.సి. రోడ్డు. హద్దులుగా గల ఇల్లు మరియు ఖాళీ స్థలం రెవెన్యూ గ్రామం మొండ్రాయి, మరియు గ్రామ పంచాయితి: గిర్నితండ, రెవెన్యూ మండలం: కొడకండ్ల జనగాం జిల్లా వ.జిల్లా ప్రజాపరిషత్తు, కొడకండ్ల సబ్ రిజిస్ట్రారు, వరంగల్ జిల్లా రిజిస్ట్రారు గారి పరిధిలో ఉన్నది.

Sd/- NALLELLA SURENDER, NALLELLA SUHAS
ADVOCATES, H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HNK, Warangal. Cell: 9849365117

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Tirumalagiri Branch వారు ఇచ్చిన బొగొట్టు ప్రకారం యావన్మందికి తెలుపునది ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తి రిజిస్ట్రార్ తనఖా చేయించుకొని, శ్రీ/శ్రీమతి ధారవత్ దేవేందర్, తండ్రి: మంక్యా గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకొన్నాము. కావున సదరు వ్యవహారముకు సంబంధించి, సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు, చార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్సు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నాటి నుండి (7) ఏడు దినములలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కాదు.

SCHEDULE OF THE PROPERTY

గ్రామపంచాయితీ: గుడికుంటతండ, రెవెన్యూ గ్రామము: మంచుప్పుల, ఇంటి నెం. 4–96, యొక్క విస్తీర్ణం: 109.8 చ.గ.లు సరియగు 91.79 చ.మీ.లు కట్టుబడి ఆర్.సి.సి. ఇల్లు నిర్మిత ప్రదేశము: 469.3 చ.అ.లు. హద్దులు: తూర్పు: బానోతు భీముడు గారి ఇల్లు, పడమర: బానోతు నర్సింహ గారి ఇల్లు, ఉత్తరం: గ్రామపంచాయితీ సి.సి. రోడ్డు, దక్షిణం: గుగులోతు సుందర్ గారి ఇల్లు. హద్దులుగా గల ఆర్.సి.సి. ఇల్లు మరియు ఖాళీ స్థలం గ్రామ పంచాయితీ గుడికుంటతండ, మరియు రెవెన్యూ గ్రామము మంచుప్పుల, రెవెన్యూ మండలం పాలకుర్తి, జనగాం జిల్లా వ.జిల్లా ప్రజాపరిషత్తు, కొడకండ్ల సబ్ రిజిస్ట్రారు, వరంగల్ జిల్లా రిజిస్ట్రారు గారి పరిధిలో ఉన్నది.

Sd/- NALLELLA SURENDER, NALLELLA SUHAS
ADVOCATES, H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HNK, Warangal. Cell: 9849365117

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, PULI AMITHA (New Name), previously called PITTALA AMITHA (Old Name), R/o. 2-10-678/2, Teachers Colony, Phase-I, Hanamkonda Mandal, Hanumakonda District - 506001, T.S., India. solemnly declare

PLOT FOR SALE

★మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు 2 వేలకు 1గజం భూమి, యాదగిరిగుట్ట దగ్గర @ ఆలేరు, జీడికల్లు రామాలయ, ప్రసిద్ధ శివాలయం దగ్గర్లో, స్పాట్ రిజి. 100% వాస్తు. Cont: 9030769178.
NTW-00

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

జీరో కరెంట్ బిల్లును అందజేస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

'గృహజ్యోతి'ని ప్రారంభించిన కలెక్టర్

జనగామ చౌరస్తా, మార్చి 4 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా సోమవారం జనగామ పట్టణం బాలాజీనగర్‌లో గృహజ్యోతి పథకాన్ని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా ప్రారంభించారు. తెల్ల రేషన్ కార్డున్న వారికి నెలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ బిల్లును లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గృహ విద్యుత్ వినియోగదారుకు జీరో యూనిట్ కరెంట్ బిల్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్, డీఈలు, ఏఈలు, మున్సిపల్ కౌన్సిలర్లు పగిడిపాటి సుధా సుగుణాకర్‌రాజు, వాంకుడోత్ అనిత పాల్గొన్నారు.

మల్కపేట పాఠశాలలో 'స్వయంపాలన'

నర్మెట, మార్చి 4: మండలంలోని మల్కపేట ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. మండల విద్యాధికారిగా బానోత్ లోకేష్, ప్రధానోపాధ్యాయుడిగా బానోత్ సాయిచరణ్, ఉపాధ్యాయులుగా బీ అభిరామ్, బీ నిక్షిత్, గోపి, భానుశ్రీ, మమత, శ్రావణి, గౌతమి వ్యవహరించారు. విద్యార్థులకు బోధనాభ్యసన సామగ్రి ఉపయోగించి పాఠాలు బోధించారు. పాఠశాల హెచ్ఎం ఉప్పుగళ్ల శ్రీధర్, సీహెచ్ తిరుపతిరెడ్డి, వై శ్రీనివాస్, ఈ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర తాత్కాలిక అధ్యక్షుడిగా బాలరాజు

బాలరాజు

బచ్చన్నపేట, మార్చి 4 : తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర తాత్కాలిక అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన వీ బాలరాజును ఎన్నుకున్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని కల్యాణి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సమావేశంలో బాలరాజు పేరును సభ్యులు ప్రతిపాదించారు. 30 ఏళ్లుగా సంఘానికి బాలరాజు అందిస్తున్న సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ రాష్ట్ర బాధ్యతలు అప్పగించిన సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతం కోసం శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

సీఐ, ఎస్సైని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

రఘునాథపల్లి, మార్చి 4: ఇటీవల బాధ్యతలు చేపట్టిన జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్ యాదవ్, రఘునాథపల్లి ఎస్సై నరేశ్‌యాదవ్‌ను సోమవారం బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతభద్రతల పరిరక్షణకు అందరూ సహరించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని కోరారు. మధ్యవర్తులను ఆశ్రయించి ఇబ్బంది పడొద్దన్నారు. నాయకులు కుర్రు కమలాకర్, కొర్ర రాజేందర్, మాజీ సర్పంచ్ మడికంటి మధు, నాయకులు నీల ఆగయ్య, మంతపురి యాదగిరి, ఎల్లారెడ్డి, రాచర్ల అనిల్ పాల్గొన్నారు.

7న వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

లింగాలఘనపురం, మార్చి 4 : మండల కేంద్రంలోని వీరన్నగుట్ట గుహలో భద్రకాళీసమేత వీరభద్రస్వామి విగ్రహాలను ఈ నెల 7న ప్రతిష్ఠించాలని గ్రామస్తులు నిర్ణయించారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో అర్చకుడు అవ్వారు ఉమానాథ్‌శర్మ మాట్లాడారు. ఈ నెల 6న విగ్రహాల ఊరేగింపు నిర్వహించాలని నిర్ణయించారు. 7న ఉత్సవ విగ్రహాలకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, 8న వీరభద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో నాయకులు బండ్ర సత్తయ్య, మాజీ సర్పంచ్‌లు కేమిడి సాయి మల్లయ్య, బోయిని యాదగిరి, ఎంపీటీసీ కేమిడి భిక్షపతి, మాజీ ఎంపీటీసీలు బృగుమహర్షి, నీలం లక్ష్మీమోహన్, మాజీ ఉపసర్పంచ్ కేమిడి కవితా వెంకటేశ్, నాయకులు బింగి స్వామి, బెజ్జం రాంనర్సయ్య, ఏదునూరి వీరన్న, మల్ల శ్రీశైలం, ఎడ్ల మల్లేశం, కేమిడి యాదగిరి, జాగిళ్లపురం అబ్బులు, నీలం నర్సయ్య, యాకూబ్, చెన్నూరి మల్లేశం పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతరకు విస్తృత ఏర్పాట్లు

జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి, అధికారులు

పాలకుర్తి, మార్చి4 : మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి క్షీరగిరిక్షేత్రంలో ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించే మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు, జాతర సందర్భంగా బందోబస్తుపై ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న, సీఐ మహేంద్రరెడ్డి, ఎస్సై మోడెం సాయిప్రసన్నకుమార్ పరిశీలించారు. ఐదు రోజుల పాటు నిర్వహించే జాతర బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. ఆలయంలోని ఘాట్‌రోడ్డు, స్వామివారి ముఖద్వారం నుంచి గర్భగుడిలోకి వెళ్లే భక్తులకు క్యూలైన్ల గురించి దృష్టి సారించారు. స్వామి వారి దర్శనం చేసుకొనే సమయంలో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కూలైన్‌లో, కొండ దిగువన కల్యాణ మండపంలో చలువ పందిళ్లను ఏర్పా టు చేస్తున్నారు. ఈ సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు నిర్వహించే విషయమై దేవాదాయ శాఖ అధికారులతో సీఐ చర్చించారు.

వేడుకలను విజయవంతం చేయాలి

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 4 : మహాశివరాత్రి సందర్భంగా డివిజన్ కేంద్రంలోని మర్రిచెట్టు స్వయంభు రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే శివరాత్రి వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులు కోరారు. సోమవారం ఆలయంలో మహాశివరాత్రి వేడుకల కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ నెల 7న శివపార్వతుల కల్యాణం, 8న మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. అదే రోజు సాయంత్రం ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో భక్తులు పాల్గొని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రామలింగంశర్మ, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, గౌరిశెట్టి శ్రీనివాస్, గన్ను రమేశ్, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, చింతకుంట్ల జగన్‌రెడ్డి, మాదారపు హరిప్రసాద్, పీ వేణుగోపాలాచారి, రఘుపతి, గోలిశ్రీను, బొల్లు లక్ష్మి, నారగోని పద్మ, గుండు మీనాక్షి పాల్గొన్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా రాజు

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 4 : బీఎస్పీ మండల అధ్యక్షుడిగా చాగల్‌కు చెందిన బాస్కుల రాజు(మున్న)ను నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో బీఎస్పీ బలోపేతానికి, బహుజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రాపాక శ్రీశైలం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరుగు మహేందర్, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్యాట రాజు పాల్గొన్నారు.